

కాలేజీల్లో 'ఫీజు' వేధింపులు

ఫీజుల కోసం ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను వేధిస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. 8లో▸



అప్రమత్తత అవసరం

నిమజ్జనాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ సూచించారు. 8లో▸



పౌష్టికాహారంతో ఆరోగ్యం

పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

ఆమనగల్లు: వానాకాల పంటలను ఆశించే చీడపీడల నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. పంటల సంరక్షణ కోసం ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో రైతులు జగన్మోహన్‌రెడ్డి, మల్లయ్య, రాజేశ్, శంకర్, జంగయ్య తదితరులు సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, వరి పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రసంపీల్చే పురుగుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి ఎసిఫెట్ 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనేక పంటల్లో పోషకలోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. వర్షాలు ఆగిపోయిన తరువాత పత్తిచేలలో 19:19:19 లను పది గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని గీతారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయాధి కారి అరుణకుమారి, ఏఈఓ మీనాక్షి పాల్గొన్నారు.

సార్వత్రిక ప్రవేశాలకు గడువు పొడిగింపు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సార్వత్రిక విద్యా పరిషత్ (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా 10, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యకు దూరంగా ఉంటూ అనివార్య కారణాలతో ఉన్నత విద్యకు దూరమైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయి చదువుకోవాలనే ఆసక్తి కలిగిన వారికి ఇది చక్కటి అవకాశమన్నారు. పదవ తరగతి ప్రవేశం కోసం ఏదైనా స్కూల్ ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌లో ప్రవేశం కోసం పదవ తరగతి పాస్, ఫెయిల్ సర్టిఫికెట్‌తో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం, ఉర్దూ మీడియంలలో అడ్మిషన్లు పొందొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 99122 90688, 99665 53924 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీపడొద్దని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట సిబ్బంది వద్దకు వెళ్లి విద్యార్థులకు భోజనం ఎలా వడ్డిస్తున్నారు, బిల్లులు సక్రమంగా అందుతున్నాయా, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన డీఈఓ పరీక్షలు దగ్గరపడుతున్న దృష్ట్యా పాఠ్యాంశాలు పూర్తి చేయాలని, మెరుగైన విద్య బోధన చేయాలని సూచించారు. 6 నుంచి 9వ తరగతి నుంచి అమలవుతున్న ఉన్నతి కార్యక్రమంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ శాస్త్రి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బరిలో ఎవరో?



కాంగ్రెస్, బీజేపీలో ఇంకా తేలని జాబితా

- ఇటు ఆశావహులు.. అటు కేడర్‌లో ఎడతెగని ఉత్కంఠ
- మరోవైపు జోరు పెంచిన అధికార పార్టీ అభ్యర్థులు
- అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అభ్యర్థుల ఎంపికపై ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలో ఉత్కంఠ నెలకొంది. అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వారంతా ఇప్పటికే ఒకవైపు చేరికలు.. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చేరవేత వంటి పనుల్లో బిజీగా మారారు. నేతల మధ్య అంతర్గతంగా ఉన్న విభేదాలను చక్కదిద్దుకుంటూ.. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికీ బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించకపోవడంతో కేడర్‌లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు నేతలు పోటీపడుతుండటం, ఎవరికి వారే.. తమకే సీటు వస్తుందంటే.. తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

కాంగ్రెస్‌లో వడపోత పూర్తి!

జిల్లాలోని ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల నుంచి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి 83 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారు టికెట్ కోసం గట్టి ప్రయత్న మే చేస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఉన్నారు. రెండు రోజుల నుంచి ఢిల్లీ వేదికగా పార్టీ స్క్రీనింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. నియోజకవర్గాల వారీగా వచ్చిన దరాఖాస్తులను వడపోసింది. అభ్యర్థుల ఆర్థిక స్థోమత, ఇప్పటి వరకు వారు చేసిన సామాజిక సేవ, స్థానిక రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల పేర్లను దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయా అభ్యర్థుల జాతకాలు అధిష్టానం చేతిలో ఉన్నాయి.వీరిలో పెద్దల ఆశీస్సులు ఎవరికి లభిస్తాయో.. చివరికి పార్టీ బీ ఫాం ఎవరి చేతికి అందుతుందో..అనే చర్చ మొదలైంది. ఇప్పటికే పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, పెద్ద మొత్తంలో ఖర్చు చేసి,ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారికి నిరీక్షణ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగాఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల అభ్యర్థులపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది.

బీజేపీలోనూ అదే పరిస్థితి

బీజేపీలోనూ అదే పరిస్థితి నెలకొంది. పార్టీ చరిత్రలో తొలిసారిగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి మొత్తం 97 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా రాజేంద్రనగర్ నుంచి 52 మంది ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. క్రమశిక్షణతో పాటు పార్టీ పట్ల విధేయత ప్రదర్శించే నేతలకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు అధిష్టానం అభ్యర్థుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలిసింది. అక్టోబర్ మొదటి వారంలో పేర్లను వెల్లడించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.



సమస్యలు వింటున్న కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూ సమస్యలపై శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మల్కీజ్‌గూడ రైతుల భూ సమస్య కొలిక్కివచ్చిందని, సీసీఎల్ఏకి నివేదిక పంపించినట్లు చెప్పారు. త్వరలో పరిష్కారమవుతుందని వెల్లడించారు. గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్న, పహాణీల్లో నమోదై భూమిని సాగుచేసుకుంటున్న వారిని గుర్తించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కలెక్టర్‌కు సూచించారు. వివిధ రక్షణ సంస్థలకు కేటాయించిన అనంతరం ఇబ్రహీంపట్నం భగాయత్ సైదాబాద్ కంచెలో మిగిలిన భూమికి సంబంధించిన రైతులకు ధరణి ద్వారా పాస్ పుస్తకాలు అందజేయాలని కోరారు. దండుమైలారం హఫీజ్‌పూర్ రెవెన్యూ పరిధిలోని 230 ఎకరాల పట్టా భూమి రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందజేయాలన్నారు. నాగన్‌పల్లి, రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్లాట్ల సర్టిఫికెట్లు గల వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కొహెడ పిల్లగుట్ట భూమి, బాటసింగారం లాజిస్టిక్ పార్కు, రైతుల ప్లాట్లు, నివాస స్థలాలకు భూముల గుర్తింపు, ఖాగజ్‌ఘాట్, ఆరుట్ల, శేరిగూడ భూవిస్తీర్ణం హెచ్చుతగ్గుల సమస్యలను ప్రత్యేకాధికారులు అందజేసే నివేదికల ఆధారంగా పరిష్కరించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగజ్‌ఘాట్ అసైన్డ్ రైతులకు కొత్త పాసుపుస్తకాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ధరణికి సంబంధించిన భూ సమస్యలను తహసీల్దార్లు, ఆర్డీఓలకు రైతులు నేరుగా వివరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, తహసీల్దార్లు అన్వర్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, రవీంద్ర దత్తు, వెంకటేశ్వర్లు, ఎంపీపీ కృపేష్ పాల్గొన్నారు.

మందు ముట్టొద్దు.. అమ్మొద్దు

- తంగెళ్లపల్లి గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

కొందుర్గు: గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం పాటించాలని.. ఎవరూ మద్యం విక్రయించకూడదని మండలంలోని తంగెళ్లపల్లి గ్రామస్తులు శుక్రవారం తీర్మానం చేశారు. సర్పంచ్ బాల్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

యోగాసన పోటీలు షురూ



పోటీల్లో క్రీడాకారుల యోగా విన్యాసాలు

కడ్తాల్: యోగాసనాలతో శరీరం, మనస్సు, మెదడుపై నియంత్రణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహేశ్వర మహాపిరమిడ్‌లోని ధ్యాన కేంద్రంలో శుక్రవారం యోగాసన 4వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసన దివ్య ఔషధమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నిరంతర యోగ సాధనతో ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చని సూచించారు. యోగాసనా భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్ మాట్లాడుతూ.. పోటీలకు 26 జిల్లాల నుంచి 600 మంది యోగా క్రీడాకారులు, 60 మంది టెక్నికల్ సిబ్బంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు రాంరెడ్డి, సతీష్, వైస్ ప్రెసిడెంట్ రాంచందర్, విశాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంత్రి సబితారెడ్డి



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజయ్ వద్ద రూ.45 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 11 చెరువులను సుమారు రూ.40 కోట్లతో సుందరీకరణ చేస్తున్నామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూంలను కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ బి.వెంకట్రాం, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ రవినాయక్, పద్మ, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, ఇతర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాన వాటా కోసం పోరాటం

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

షాద్‌నగర్: సబ్బండ కులాలకు అన్ని రంగాల్లో సమాన వాటా కోసం ధర్మసమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ స్పష్టం చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రకులాలకు చెందిన పార్టీల నేతలు అణగారిన కులాలకు చెందిన వారిని ఎదగనీయడం లేదని విమర్శించారు. ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో అణగారిన కులాల వారు రాణించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకుల ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీని అరికట్టేందుకు ధర్మ సమాజ్ పార్టీని స్థాపించినట్లు ఆయన తెలిపారు. రాజ్యాధికారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు పరిపాలకులుగా మారినప్పుడే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే రాజ్యాధికారం సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు సత్తా చాటాలని, ఐక్యంగా ఉంటే ఏమైనా సాధించవచ్చన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల రూట్ స్టడీ!

- నిమజ్జన మార్గాలపై ప్రత్యేక అధ్యయనం
- విగ్రహాల ఎత్తు–వంతెనల ఆధారంగానే..
- ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి
- ఈసారి పీవీఎన్‌ఆర్ మార్గ్‌లో అదనంగా క్రేన్లు
- సున్నిత ప్రాంతాల్లో సిటీ కొత్వాల్ పర్యటన



పాతబస్తీలోని మండపం వద్ద సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: 'గణేష్ విగ్రహాలతో ఊరేగింపుగా వచ్చే ఒక్క లారీకీ ఆటంకాలు ఏర్పడకూడదు. ఎక్కడా ట్రాఫిక్ జామ్స్‌కు తావుండకూడదు. 29వ తేదీ తెల్లవారుజాము సమయానికే ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ సాధారణ ట్రాఫిక్‌కు అందుబాటులోకి రావాలి'

– గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలివి. ఈ నెల 28న జరిగే ఈ క్రతువు కోసం అధికారులతో పాటు క్షేత్ర స్థాయిలో ఉండే సిబ్బంది ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ట్రాఫిక్ ఠాణాల వారీగా నిమజ్జనం రూట్లను అధ్యయనం చేస్తూ, మండప నిర్వాహకులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు నేతృత్వంలో డీసీపీలు రాహుల్ హెగ్డే, డి.శ్రీనివాస్ వీటిని పర్యవేక్షిస్తున్నారు.

విగ్రహాల ఎత్తు ఆధారంగా మార్గం..

సామూహిక నిమజ్జనాన్ని సజావుగా పూర్తి చేయడంలో ట్రాఫిక్ అధికారుల పాత్ర కీలకం. ఊరేగింపు మార్గంలో ఏ చిన్న అవాంతరం ఏర్పడినా గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటంతో పాటు ఆ ప్రభావం మరుసటి రోజు ట్రాఫిక్‌పై పడుతుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి వివిధ మార్గాల్లో ఉన్న పాట్‌హోల్స్ మరమ్మతులు, చెట్టు కొమ్మల నరికివేత తదితర చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసిన మండపాల వివరాలు పోలీసుస్టేషన్ల వారీగా అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. మండపం ఏర్పాటు సమయంలో, ఆ తర్వాత నిర్వాహకులు పోలీసులు ఇచ్చిన పత్రంలో విగ్రహం ఎత్తు, నిమజ్జనం జరిగే తేదీ, ప్రాంతం ఉంటున్నాయి. ఈ వివరాలు సేకరించిన ట్రాఫిక్ ఠాణాల వారీగా అధ్యయనం చేస్తున్నారు. సదరు విగ్రహం ఊరేగింపు జరిగే మార్గాల్లో ఉన్న వంతెనలు, వాటి ఎత్తు పరిగణనలోకి తీసుకుంటున్నారు. రోడ్డు నుంచి వంతెన ఎంత ఎత్తులో ఉందో దాని కంటే కనిష్ఠంగా ఐదు అడుగుల తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలకే ఆయా రూట్లలో క్లియరెన్స్ ఇస్తున్నారు.

పీవీఎన్‌ఆర్ మార్గ్‌లో హోల్డింగ్ ఏరియా..

నిమజ్జనానికి విగ్రహాలను తీసుకువచ్చే ప్రతి వాహనానికీ పోలీసు విభాగం సీరియల్ నెంబర్‌తో కూడిన స్టిక్కర్ ఇస్తుంటుంది. ఈసారి ఇందులో విగ్రహం ఎత్తును పొందుపరుస్తున్నారు. ఆయా వాహనాలకు ముందు భాగంలో అతికించి ఉండే దీన్ని అంబేడ్కర్ విగ్రహం చౌరస్తాలోని పోలీసు సిబ్బంది పరిశీలిస్తారు. విగ్రహం ఎత్తు ఆధారంగా ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీఎన్‌ఆర్ మార్గ్‌లోని వాటిని పంపిస్తారు. నిమజ్జనం రోజున ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌ల్లోకి సాధారణ వాహనాలు అనుమతించరు. ఈ నేపథ్యంలోనే వీలున్నంత వరకు 29వ తేదీ తెల్లవారేసరికి నిమజ్జనం పూర్తి చేసి, ఈ రెండు రూట్లను సాధారణ వాహనాలను అందుబాటులోకి తేవాలని ట్రాఫిక్ అధికారులు భావిస్తున్నారు. మరోపక్క పాతబస్తీలోని సున్నిత ప్రాంతాల్లో ఉన్న గణేష్ మండపాల వద్దకు స్వయంగా వెళ్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అక్కడి పరిస్థితులు, మార్గాలను అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన గురువారం రాత్రి హుస్సేనిఆలం, కామాటిపుర, మొఘల్‌పురాలో ఆనంద్ పర్యటించారు.

తెలుగుతల్లి జంక్షన్ మూసివేతతో..

రాజధానిలో ఎన్ని నిమజ్జనం జరిగే చెరువులు, పాండ్స్ ఉన్నప్పటికీ... హుస్సేన్‌సాగర్‌కు ప్రత్యేకత ఉంది. బషీర్‌బాగ్ వైపు నుంచి వచ్చే ప్రధాన ఊరేగింపులోని విగ్రహాలన్నీ అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా, తెలుగుతల్లి జంక్షన్ మీదుగా అటు ట్యాంక్‌బండ్, ఇటు ఎన్టీఆర్ మార్గ్‌వైపు వస్తాయి. కొత్త సచివాలయం అందుబాటులోకి రావడంతో ఆ ప్రాంతంలోని రహదారులు, జంక్షన్ల వద్ద కీలక మార్పుచేర్పులు జరిగాయి. తెలుగుతల్లి చౌరస్తా మూసివేతతో పాటు సచివాలయం ముందు కొత్త రోడ్డు అందుబాటులోకి రావడం, ఎన్టీఆర్ మార్గ్‌లో ఫుట్‌పాత్ నిర్మాణాల నేపథ్యంలో ఈ ఏడాది నిమజ్జనం ప్రక్రియలో స్వల్పమార్పు చేర్పులు చోటు చేసుకోనున్నాయి. తెలుగుతల్లి జంక్షన్ మూసివేత నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా విగ్రహాలతో వచ్చే లారీలు ఇక్బాల్ మినార్ వైపు వెళ్లి... ఫ్లైఓవర్ ప్రారంభం వద్ద యూ టర్న్ తీసుకుని ట్యాంక్‌బండ్ వైపు రానున్నాయి. ఈసారి పీవీఎన్‌ఆర్ మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజా పక్కన ఓ నిమజ్జనం ఘాట్ నిర్మించిన అధికారులు అక్కడ అదనంగా మూడు క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

- రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి:యువత మాదకద్రవ్యాలు తీసుకొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నిరోధకంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైందన్నారు. మద్యపానం, ధూమపానం కంటే ఎంతో ప్రమాదకరమైందని తెలిపారు. మాదకద్రవ్యాలు సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు చెడు మార్గాలను వదిలి సన్మార్గంలో నడుచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చాన్స్‌లర్ ఎల్.ఎస్ గణేశ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ సునీతారెడ్డి, యాంటీ నార్కోటిక్ ఎస్పీ చక్రవర్తి, యాంటీ నార్కోటిక్ డీఎస్పీలు నర్సింగ్‌రావు, శివన్నాయుడు, హరిచంద్రారెడ్డి, నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, మోకిల సీఐ నరేష్, ఎస్ఐలు నాగరాజు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు అప్రమత్తత అవసరం

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ మురళీకృష్ణ

చేవెళ్ల: వినాయక నిమజ్జనాల సమయంలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ మురళీ కృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి పుష్కరిణిని పరిశీలించారు. లైటింగ్, క్రేన్‌లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ శైలజకు సూచించారు. రోడ్డు క్లియరెన్స్ చేసుకోవాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. నిమజ్జన సమయంలో ప్రజలను నీటిలోకి అనుమతించవద్దన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ సీఐ సైదులు, ఎఎస్ఐ చందర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులున్నారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

యువ రైతు మృతి



శ్రీనివాస్(ఫైల్)

శంకర్‌పల్లి: స్కూటీని కారు ఢీకొట్టడంతో ఓ యువరైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని పర్వేదకు చెందిన చాకలి శ్రీనివాస్(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి పని నిమిత్తం తన స్కూటీపై శంకర్‌పల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోకి రాగానే గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య తేజేశ్వరి, ఐదు నెలల కుమారుడున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నాటుసారా వ్యాపారుల బైండోవర్



నాటుసారా వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కేశంపేట: నాటుసారా వ్యాపారులను శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 25 మందిలో గతంలో నాటుసారా వ్యాపారం చేసేవారు. వీరిని షాద్‌నగర్ ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ అజీంఅలీ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ ఖాళప్ప, రవి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కొందుర్గు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉమ్మెంత్యాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కర్రె చెన్నయ్య(65) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం అయినా తిరిగి రాలేదు. గ్రామ శివారులోని ఓ బావి వద్ద చెన్నయ్య టవల్, చెప్పులు కనిపించాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. బావిలో బురద, చెత్త ఉండడంతో నీరు తోడేందుకు వీలు పడలేదని.. శనివారం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ప్రైవేటు కాలేజీల్లో ‘ఫీజు’ వేధింపులు

- రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వని యాజమాన్యాలు
- ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో చేరేందుకు విద్యార్థుల అవస్థలు
- ప్రభుత్వం స్పందించాలని స్టూడెంట్ యూనియన్ల డిమాండ్



ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతలు

ఇబ్రహీంపట్నం: ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వేధిస్తుండటంతో పేద విద్యార్థులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే విద్యార్థుల జీవితాల్లో వెలుగు నిండుతాయని భావించిన ప్పటికీ తెలంగాణలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ పెట్టడంతో వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఉన్నత చదువులకు వెళ్లాల్సిన వారు, ఉద్యోగాలకు ఎంపికైన వారు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో.. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు మొండికేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఫీజులను చెల్లించలేని దీనస్థితిలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రీయింబర్స్‌మెంట్‌తో సంబంధం లేకుండా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేయాలన్నారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల దీక్షకు కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, డీవైఎఫ్ఐ సంఘాలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు చరణ్, విప్లవ్, తరంగ్, వంశీ, శ్రీకాంత్, వినయ్, వినోద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా..

- ఆటో, బైక్ ఢీ..
- నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి. నుజ్జునుజ్జయిన ఆటో

ఆమనగల్లు: చిన్నారికి జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన పట్టణ సమీపంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పెంట తండాకు చెందిన భరత్ తన మేనల్లుడు రంజిత్‌కు జ్వరం రావడంతో మల్లేశ్‌తో కలిసి ఆమనగల్లుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద వీరు బైక్‌తో బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భరత్, మల్లేశ్, బాలుడు రంజిత్, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వివాహిత బలవన్మరణం

శంకర్‌పల్లి: ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కటికె అంకిత(35) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యుల రోదనలు విన్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలు రాజుకు రెండో భార్య. ఈయన మొదటి భార్య పదేళ్ల క్రితం అనారోగ్య సమస్యతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

భర్త హత్య కేసులో భార్యకు రిమాండ్

కొత్తూరు: భర్తను రోకలితో మోది హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సీఐ శంకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పెంజర్ల గ్రామానికి చెందిన పాముల నర్సింహులు(50), నర్సమ్మ భార్యాభర్తలు. నర్సింహులు మూగవాడు కావడంతో పెళ్లినాటి నుంచి దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతన్నాయి. నెల రోజుల క్రితం నర్సమ్మ మహిళా సంఘం నుంచి రూ.2లక్షల రుణం తీసుకుంది. ఈ డబ్బుతో తనకు బైక్ కావాలని భర్త కోరగా.. ఆమె బంగారం కొనుగోలు చేసింది. ఇదే విషయమంలో ఈ నెల 19న మద్యం మత్తులో ఇరువురూ గొడవపడ్డారు. విచక్షణ కోల్పోయిన భార్య రోకలితో భర్తపై దాడి చేసింది. గమనించిన స్థానికులు ఇద్దరినీ సముదాయించారు. తిరిగి మరోమారు ఆమె దాడిచేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితురాలు శుక్రవారం ఉదయం పట్టణంలోని కల్లు దుకాణం వద్ద ఉన్నట్లు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నందిగామ: దొంగచాటుగా గంజాయి విక్రయిస్తున్న ఓ సెక్యూరిటీ గార్డును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రం రొటాస్ జిల్లా డైదాన్ పోస్టు హేలన్ గ్రామానికి చెందిన చింటు కుమార్ సింగ్ నెల రోజుల క్రితం శంషాబాద్ మండలం పాలమాకులకు వలస వచ్చాడు. స్థానికంగా నివాసం ఉంటూ జైభీం గార్డెన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడిన చింటు కుమార్‌సింగ్ సొంత గ్రామం నుంచి వచ్చే సమయంలో గంజాయిని తీసుకు వచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడు. పాలమాకులకు చెంతనే కొత్తూరు, నందిగామ మండలాలు ఉండటం, అక్కడ పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో కార్మికులు ఉంటారనే విషయాన్ని తెలుసుకొని నందిగామలో గంజాయి విక్రయిస్తున్నాడు. శుక్రవారం పారిశ్రామిక వాడలో అనుమానాస్పదంగా కనపడటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద నుంచి 9 ప్యాకెట్లులో 72 గ్రాముల గంజాయి లభించింది. దీంతో గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి



ఉప్పల లక్ష్మమ్మ(ఫైల్)

కడ్తాల్: కూలీ పనులకు వెళ్లిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన కడ్తాల్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మమ్మ(50) రోజు మాదిరిగానే గుర్లకుంటతండా సమీపంలోని ఇండో–అమెరికన్ సీడ్స్ ల్యాండ్స్‌లో కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం 2గంటల సమయంలో ఆమె ప్రమాదవశాత్తు పడిపోయింది. గమనించిన సూపర్‌వైజర్ అనిల్ బాధితురాలిని చికిత్స నిమిత్తం తుక్కుగూడలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని చూసిన ఆమె బంధువులు మృతిపై అనుమానాలున్నాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్
- ఢిల్లీలో కిషన్‌రెడ్డితో భేటీ



కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న వీరేందర్ గౌడ్

మహేశ్వరం: తాను బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వచ్చే పుకార్లను నమ్మొద్దని పార్టీ మారే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను మంత్రి పి.సబితారెడ్డి పాతబస్తీకి చెందిన మజ్లిస్ పార్టీ వారికి అక్రమంగా కట్టబెట్టేందుకు చేస్తున్న యత్నాలు, బీజేపీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటం గురించి ఆయనకు వివరించారు. తాను గమనిస్తున్నానని రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని పోరాటాన్ని ఉధ్రుతం చేయాలని రాష్ట్ర నాయకత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని కిషన్‌రెడ్డి సూచించారన్నారు. అనంతరం రాజ్య సభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిశారు. వీరేందర్ గౌడ్ ఢిల్లీ పయనం కావడంతో నియోజకవర్గంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి విమానంలో వెళ్లారని త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని చర్చ జరిగింది. వీటన్నిటికి కిషన్‌రెడ్డితో భేటి కావడంతో పుకార్లకు పుల్‌స్టాప్ పడింది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ నాగమణి



పోషకాహారాన్ని అందజేస్తున్న సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నాగమణి అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొనడంతో శుక్రవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి హాజరై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తప్పని సరిగా పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పోషకాహారం లోపంతో రక్తహీనత, రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గుడ్లు, పాలతో పాటుగా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, లబ్ధిదారులు శకుంతల, అమృత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీగా భద్రయ్య

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీగా) కే భద్రయ్య నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన కరీంనగర్ ఏసీబీ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న సూర్యనారాయణ అదనపు ఎస్పీగా పదోన్నతిపై రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ)కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని లేదా ఇన్‌స్పెక్టర్ల ఫోన్ నంబర్లు 91543 88970, 91543 88968, 91543 88966, 91543 88967 నంబర్లలో కూడా సంప్రదించవచ్చని సూచించారు.

బాలాపూర్‌లో ఆర్యవైశ్యుల ప్రత్యేక పూజలు



బాలాపూర్ గణనాథుడి సన్నిధిలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని బాలాపూర్ గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చింతల బాలరాజుగుప్తా, హస్తినాపురం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు కాసుల శ్రీనివాస్‌గుప్తా, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీరామచంద్ర మూర్తి, ఈర్వింటి సురేశ్, గందె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఏడేళ్లుగా వైశ్య సంఘం ఆధ్వర్యంలో వేలాది మందికి అన్న ప్రసాద వితరణ చేస్తున్నారని అభినందించారు.